# A Commemorational Article on KV Mahadevan on his Vardhanti

-- Raga (06/22/2009)

నీ పేరు తలచినా చాలు ... మదిలో శతకోటి యమునా తరంగాలు పొంగడానికి, కొమ్మ కొమ్మలో కోయిలలు సన్నాయి రాగాలు మరచిపోడానికి, పాటలకి శిలలు కరగడానికి రసవాహిని స్వాగతించడానికి, గుండె ఝల్లుమనడానికి, సెలయేరు గలజల గలజల అంటూ పారడానికి, జాబిలి నేల మీదకు రావడానికి, నాదము ఝుమ్మనడానికి, కిల కిల నవ్వులు రువ్వడానికి. ఆ పేరే 'కె.వి.మహాదేవన్'.

నుదుట విభూతి, రూపాయి కాసంత కుంకుమ బొట్టు, గండు కోయిల నోటిలా ఎర్రటి నోరు, మనసుని తెలిపే తెల్లటి బట్టలు, పసిమి మేని ఛాయ, మౌన గంభీరము, దివి నుండి భువికి దిగి వచ్చిన నాద రూపమా అని అనిపించేడట్టుగా ఉండేవారు మహదేవన్. నాద శరీరుడైన శివుడే సామవేద సారాన్ని ప్రపంచానికి పంచడానికి ఈ 'మహదేవన్' గా అవతరించాడేమో.

సంగీతము, సాహిత్యము లేక ఆసక్తి అనురక్తి కలిగించదని విశ్వసించిన వారు మహదేవన్. ఏ నాడు బాణి ఇచ్చి పాట రాయించుకొని ఎరగరు. సాహిత్యాన్ని బట్టే ఏనాడైన సంగీతం అందించేవారు.

పుట్టినది తమిళ్ నాడు, కేరళ సరిహద్దులలో. "శృతి లయలే జననీ జనకు" లయిన ఆ స్వరబ్రహ్మ 'ముందడుగు' సినిమా ద్వారా తెలుగు సినీ ప్రపంచంలో మొదటి అడుగు వేశారు. నాలుగు దశాబ్దాల పాటు ఎన్నో పాటలకి జనకుడైనాడు. 'మంచి మనసులు', 'మూగమనసులు'లలో ఆయన స్వర పరచిన "మామ మామ మామా", "మావయ్యో.. నా మొగుడెవరయ్యా" అనే పాటల ద్వారా "మామ" బిరుదాంకితులయ్యారు. "పగటి కలలు కంటున్న మావయ్య", "ఎంకొచ్చిందోయ్ మావ", "నీ ఎదుట నేను, వారెదుట నీవు.. మా ఎదుట ఓ మామ ఎప్పుడుంటావు", "అదిరింది మావా అదిరిందిరో".... ఈ పాటలు వింటే చాలు ఇవి మామవేవని ఇట్టే చెప్పేయ్యవచ్చు. ఆ తరవాత వచ్చిన ఎన్నో "మామ" పాటలు అయనకు ఆ పేరే స్థిరపరిచాయి.

తెలుగు భాషపై అతనికి అంత పట్టులేదనే వారు. కానీ పాటకు స్వరాన్ని ఇచ్చేటప్పుడు మాత్రం ఆ పాట సాహిత్యాన్ని ఒకసారి పూర్తిగా చదువుకొని, కొద్ది సేపు మౌనముగా ఆ సాహిత్యాన్నే చూసి, అప్పు ( పుహళేంది ) వైపు చూసి ఒక చిరునవ్వు నవ్వేవారట.

అంతే పాటకు స్వరం రెడీ!! కొన్ని సంధర్భాలలో పాటకి సాహిత్యము ఆయనే అందించుకునేవారట.

ఒకసారి వేటూరి రాసిన 'ప్రేమ బంధం' సినిమా పాట 'చేరేదెటకో తెలిసి - చేరువ కాలేమని తెలిసి - చెరి సగమయ్యామెందుకో తెలిసీ" అని రాసి ఇస్తే ఆ పాటకు రెండో లైన్ 'తెలిసి తెలిసీ' అని, మూడవ లైన్ 'తెలిసి, తెలిసి, తెలిసీ' అని పలికించి, పాటకు ప్రాణ ప్రతిష్ట చేశారని వేటూరే అన్నారు. అటువంటి భావ స్వర జనకుడికి భాష అవసరమా? ఆయనకు తెలిసింది ఒకే భాష ...అది సుస్వరాల సంగీతం. ఆయనకి రాగాలు, స్వరాలు సజీవ రూపాలుగా  కనిపించి భావము ఎలా ప్రకటించాలో తెలుపుతాయేమో?

మామ, విశ్వనాథ్, వేటూరి .. వీరి కలయిక భావ, రాగ, వేదాల సారం. వీరి కలయికలో వచ్చినవన్నీ ఆణిముత్యాలే. అన్నీ పాటలు ఆపాత మధురాలే, అమృతగుళికలే.. ప్రతీ సినిమా  'న భూతో న భవిష్యతి'. ఒక శుభోదయాన శృతిలయలను శంకరాభరణాలుగా చేసి, సిరివెన్నెలలో స్వాతికిరణాల్లా శుభలేఖలు పంచారు.

శంకరాభరణము.. అంత వరకు ఎన్నో మాస్ పాటలు పాడిన ఎస్.పి చేత అమృత భాండాన్ని అందింపచేశారు. 'మౌనవిచక్షణ గానవిలక్షణ రాగమే యోగమనీ' అని నిరూపించారు.  'శ్రీచరణ మందార మధుపమునై వ్రాలి', 'ఝుమ్మంది నాదం', 'ఉచ్చ్వాసం కవనం, నిశ్వాసం గానం',  'తెలవారదేమో స్వామీ'  లాంటి ఆణిముత్యాలెన్నెన్నో!  'ఆ చింత నీకేలరా' పాట అంతా పూర్తి అయ్యాక విశ్వనాథ్ పోతన పద్యాలు పెడితే ఎలా ఉంటుంది అని మామని అడిగారట. అందుకు మామ 'సరే పెడదాము' అని పాటలో కిట్టించినట్టు కాక సరిగ్గా సరిపోయేటట్టు ఆ పద్యాలు అమర్చారు... ఈ శుభోదయం సినిమాలో ప్రతీ పాటా రాగసుధా భరితమే.

మామ గురించి ఇంత చెప్తూ ఒక్కసారీ వారి సగ భాగము గురించి చెప్పకోకపోతే సంపూర్తి అవ్వదేమో కదా... రమణ మహర్షికి గణపతి ముని, రామకృష్ణ పరమహంసకి వివేకానందునిగా మామకు 'అప్ప' (పుహళేంది) ఒక మానస పుత్రుడిగా దొరికాడు. ఆయనకు గురువు మీద గౌరవంతో స్వాతికిరణంలోని పాటలు అన్నీ ఆయనే స్వరపరచి పేరు మాత్రము గురువు గారిది పెట్టించి  గురుదక్షిణగా ఇచ్చుకున్నారు.

శంకరాభరణంలో శంకర శాస్త్రిని ఆటపట్టించే కుర్రాళ్ళకి శంకరశాస్త్రి ఒక రాగాన్ని ఆలపించడానికి ఇస్తాడు. ఆ రాగం స్వాతికిరణంలో "ప్రణతి ప్రణతి ప్రణతి" పాటకు సమకూర్చారు. ఈ ఒక్క ఉదాహరణ చాలదూ.. ఆ గురు శిష్యుల అనుబంధాన్ని తెలియబరచడానికి. వారిరువురి అభిప్రాయాలు ఎంతగా కలుస్తాయో!! ఒకరు నాదశరీరులైతే వేరొకరు రాగాత్ములు. ఏ పాట సమకూర్చేటప్పుడైనా వారు మాట్లాడుకోవడం తక్కువ.. ఒకరి నొకరు చూసుకొని ఒక చిరునవ్వు నవ్వుకునేవారట. అంతే మామ అనుకొన్న స్వరానికి పుహళేంది ట్యూన్ అయ్యిపోయేవారు.

వర్షం పాట అనగానే మొదట గుర్తు వచ్చే పాటలు 'చిట పట చినుకు పడుతూ ఉంటే', 'చిటాపటా చినుకులతో కురిసింది వాన', 'చిటపట చినుకుల మేళం.. తడి పొడి తపనల తాళం', 'ఏ వానో తడుముతున్నదీ', 'చూరట్టుకు జారతాది చిటుక్కు చిటుక్కు వానచుక్క'.. ఈ పాటల ఝల్లులో తడవని రసహృదయుడు లేదంటే అతిశయోక్తి కాదేమో.

పాటలలో భావాన్ని ప్రకటింపచేయడములో వారికి వారే సాటి. దాగుడుమూతలు సినిమాలో "మెల్ల మెల్ల మెల్లగా ", "వెచ్చ వెచ్చని నీ ఒడిలో","ము.. ము.. ముద్దంటే చేదా", "కళ్లతోటి కళ్ళుమేసి కదం తొక్కకూ మావా మావా (ఆకులు పోకలు ఇవ్వద్దు)", "తడిసిన అందాలలో" (ఈ పాటకు ముందు ఆలాపన మానవమాత్రులకు స్వరపరచడం సాధ్యమా అనిపిస్తుంది!) , "గుండె ఝల్లు మన్నది", "తెలుసులే నీకు తెలుసో లేదో కానీ", "గుమ్మా చూపు నిమ్మ ముల్లు".. ఇవ్వన్నీ వింటే అల్లరికి చిలిపితనము జోడించి కట్టిన రాగాలుగా అనిపిస్తాయి.

"సామజ వరగమనా (వేసవి రేయిలా ఇలా)", "మనసులోని మర్మమును తెలుసుకో (అణువు గాని ఏకాంతాన ఏ కాంత కైన)", "ఎంత నేర్చినా.. ఎంత చూసినా".. ఇటువంటి త్యాగరాజ కృతులను ఎవరూ ఊహించని రీతిలో శృంగార గీతాలుగా చిత్రీకరించి సాహసమే చేశారని అనాలి.

"అల్లిబిల్లి అమ్మాయి.. అందాచందాలున్నాయి".. ఈ పాటలో బాలు స్వరము అలలులా తిరిగే తీరు, "హవ్వరే హవ్వ హైలెస్సో", "ఎంకొచ్చిందోయ్ మావ ఎదురొచ్చిందోయ్", "పన్నెండేళ్లకు పుష్కరాలు", "పచ్చగడ్డి కోసేటి పడచు పిల్ల"... ఈ పాటలు తుంటరి

రాగానికి , అల్లరి స్వరాన్ని కూర్చారా అని అనిపించక మానవు.

సాహిత్యములో ఉన్న  భావాలు ప్రకటింపచేసి ఆ అమృత వాహినిలో తడిసేలా చేసేవారు మామ. నీ పేరు తలచిన చాలు (ఏకవీర ) పాటలో కరుణాంతరంగముల దాగి దాగి.. చెలి అందెలందు చెలరేగి.. రేగి నను తొందరించెరా.. తొలకరించెరా" అన్నప్పుడు అలలా సాగుతూ ఒక్కసారి "తొందరించెరా" అన్నప్పుడు తొందరపడటము... "చల్లని ఉల్లము అల్లన ఝల్లన పరవచెరా" అన్నప్పుడు ఆ ఆర్ధ్రత వినాలే కాని చెప్పనలవి కాదు.

ఈనాడు వచ్చే టి.వి. ప్రోగ్రాములు 'పాడుతా తీయగా చల్లగా',  'పాడాలనే ఉన్నదీ', 'ఝుమ్మంది నాదం'..  అలా ఎన్నో కార్యక్రమాలకి  ఆయన సమకూర్చిన పాటల పేర్లే పెట్టడం..  వారిపై ఉన్న అభిమానం ప్రకటించడమే. 'భాణోచితం ఇదం జగత్' అన్నట్టు  'మామోచితం ఇదం సంగీత జగత్' అనాలేమో!! ఆయన సమకూర్చిన బాణీలే ఈనాటికీ ఎందరి సంగీత దర్శకులకో దిక్సూచీలైనాయి.

'ముత్యమంతా పసుపు ముఖమెంత ఛాయ ', 'రావమ్మ మహాలక్ష్మీ', 'శ్రీరస్తూ శుభమస్తూ' , 'భారత మాతకు జేజేలు '... ఈ పాటలు తెలుగుదనము ఉన్నతవరకు ఉంటాయి. ఆ పాటలున్నంత వరకు మామ అభిమానుల హృదయ గగనాలలో నిండు చందమామగా వెలుగుతూనే ఉంటారు.